# అజ్ఞాత దర్శకుడు

రామ్మూర్తి గ్రాడ్యుయేటు. డ్యూటీలో జాయినయి, ఆ సాయంకాలం మొట్ట మొదటిసారిగా నాలుగురోడ్ల కూడలిలో నిలబడి ట్రాఫిక్ సిగ్నల్స్ ఇస్తున్న ప్రతిసారి అతనికి తను గ్రాడ్యుయేట్‌ననే విషయం గుర్తుకి వస్తోంది. బి.ఏ. పాసయ్యా, తనో పోలీస్ కానిస్టేబిల్‌గిరిలో చేరాడు. ఏదో న్యూనతాభావం అతని మనసుని కుంగ తీసింది. వెంటనే ఆ వాక్యాల్ని తిరగేసి కానిస్టేబిల్ ఉద్యోగమే చేస్తున్నా తను బి.ఏ. (ఫిలాసఫీ) అని కొంచెం గర్వం తెచ్చిపెట్టుకున్నాడు. శ్రమగౌరవ సిద్ధాంతం గుర్తుకి తెచ్చుకున్నాడు. మానవశ్రమ ఏదైనా గౌరవభాజనమైంది. రామ్మూర్తికి కొంత ఊరట కలిగింది. కాని ఏదో అసంతృప్తి మనసులో గూడుకట్టుకునే ఉంది. సమాజంలో ఎవరో తన అభ్యుదయాన్ని అడ్డుతున్నారు. రెండేళ్ళనించీ తన ఎదుట రెడ్ సిగ్నలే! ఎరుపంటే తనకెంతో ఇష్టం. కాని రెడ్ సిగ్నలంటే కాదు. అదంటే అసహ్యం, కోపం. కోపంతో మనిషి వదనం ఎర్రగా వుంటుంది. ఆ ఎరుపు తన కిష్టమేనా? తన ప్రశ్నకి రామ్మూర్తికి నవ్వొచ్చింది.

ఎదురుగా ఎర్రటి చిన్న కారు సాయంకాలం ఎండలో మరింత ఎర్రగా మెరుస్తూ దూసుకువస్తోంది. డ్రైవర్ హారన్ కొట్టి డైరెక్షన్ చూపించాడు. రామ్మూర్తి ముఖం ప్రఫుల్లమైంది. బాగుంది. ఇంకేమీ చూడకుండా ఆ కారుకి క్లియర్ సిగ్నల్ ఇవ్వాలని చేయెత్తాడు. కాని ఇంతలో ఎడమనుంచి స్కూటర్ ఒకటి తటాలున ముందుకొచ్చింది. స్కూటర్ మీదున్న వ్యక్తి డై.రెక్షన్ చూపించి కానిస్టేబిల్‌వంక చూడకుండానే పోబోతుంటే రామ్మూర్తికి కోపం వచ్చింది. కాని తటపటాయిస్తే ఏక్సిడెంటవుతుందేమోనని ఎర్రకారుకి స్టాప్ సిగ్నల్ చూపించాడు. ఇంతలో స్కూటర్ సాగిపోయింది. రామ్మూర్తి ముఖం చిట్లించుకుని కారుకి డైరెక్షన్ చూపించాడు. అంతే! ఆ కారులాగానే ప్రగతి, అనుకోకుండా ప్రగతికి ఎప్పుడూ ఏదో అడ్డే. అన్నట్టు ప్రగతికి ఎరుపురంగు సంకేతం! అందుకే తనకి ఎరుపు రంగంటే ఇష్టమా! లేక ఎరుపు ఇష్టం కనుక ప్రగతి ఇష్టమా? అసలు ప్రగతికీ ఎరుపురంగుకీ ఏమిటి సంబంధం ? వెంటనే రామ్మూర్తి మనసులో అరుణారుణ

సూర్యబింబం మెదిలింది. చీకట్లని చీల్చుకుంటూ దిక్చ్రక్రంమీద ఎర్రటి సూర్యుడు అందరికీ అభయహస్త మిస్తున్నట్టు ప్రత్యక్షమయే దృశ్యం రామ్మూర్తి మనసులో దృగ్గోచరమైంది. అతను ఒక్క-క్షణం మైమరిచాడు. అందుకే ఎర్రటివంటే తన కిష్టం. మందారం ఎరుపు, పారిజాతం తొడిమ ఎరుపు, కొత్త చిగురు ఎరుపు, నిప్పురవ్వ ఎరుపు, రక్తం ఎరుపు — రామ్మూర్తి తృళ్ళిపడ్డాడు. రక్తం ఎరుపు తన కిష్టమా? అతనికి ఓ క్షణం భయం వేసింది. ఏదీ తేల్చుకోలేకపోతున్నాడు....తటాలున అతని మనసులో వసంత వదనం ఫ్లాష్ అయింది.వసంత వదనం ఎరుపు. ఎరుపు.... ఆమె అందమైందని తన కిష్టమా, లేక ఆ వదనంలోని ఎరుపుకీ తన అంతరంగంలో నిత్యం మెరిసే ఎరుపుకీ పోలిక ఉందని ఇష్టమా!

రామ్మూర్తి ముఖంమీద విచారం ముసురుకుంది. చితికిపోయిన కింది మధ్య తరగతి కుటుంబానికి ఉండే ఆర్థిక ఇబ్బందులతోపాటు, వసంత తండ్రికి తాగుడు, పేకాట వ్యసనాలున్నాయి. సవతితల్లి సంస్కారహీనురాలు. సరైన పెంపకం లేని ఆమె పిల్లలు చదువుసంధ్యలు అబ్బక గాలికి తిరుగుతున్నారు. ఆ కొంపలోనించి, ఆ నరకం నించి బయటపడాలని వసంత విశ్వప్రయత్నాలు చేస్తోంది. మెట్రిక్ పాసై రెండేళ్ళనించీ తనలాగే ఉద్యోగంకోసం ఎవరిచుట్టూ తిరిగినా లాభంలేకపోయింది. తనకి ఉద్యోగం దొరకగానే ఎవరికిష్టం ఉన్నా, లేకపోయినా ఆమెని పెళ్ళి చేసుకొని తనవెంట తీసుకుపోతానని అడపాదడపా చెబుతూవచ్చాడు. తనమీద ఎన్నో ఆశలు పెట్టుకొంది. మంచి ఉద్యోగం సంపాదించి తనని ఉద్ధరిస్తాడని మనసారా నమ్మింది. కాని తనకి చివరికీ చిన్న ఉద్యోగం మాత్రం దొరికింది. ఈ విషయం ఆమెకి చెప్ప లేదు — ఏమంత ఘనమైన సంగతి. చెబితే ఏమంటుందో ? తనని చులకనగా చూస్తుందేమో! అసలు నిజంగా బి.ఏ. పాసయావా అని ఈసడించి అడుగుతుందేమో! కాని వసంత అలాంటిదికాదు—తనకి ఎన్నిగాయాలు తగిలినా ఇతరులని గాయపరచటం ఆమెకి చేతకాదు. కాని తను ప్రయోజకుడని ఆమె ఇప్పటిదాకా అనుకుంటూ ఉంది. ఇలా నిష్ప్రయోజకుడై ఏదో మామూలు ఉద్యోగంతో పొట్టపోసుకునే స్థితికి వస్తే ఆమెకి తనమీద గౌరవం ఏముంటుంది! రామ్మూర్తి మనసులో తటాలున ఓ దృశ్యం మెదిలింది. అసలు వసంతతో పరిచయం చిత్రంగా ఇదే వేషంలో జరిగింది.

ఆ రోజు రాత్రి సుమారు పదింటికి కాలేజి యానివర్సరీ కాగానే ఇంటికి బయలుదేరాడు. యానివర్సరీ వేడుకల్లో తను పోలీస్ కానిస్టేబిల్‌గా ఫాన్సీ డ్రెస్

పోటీలో పాల్గొన్నాడు. ఆశ్చర్యం ! తన కా బుద్ధి ఎందుకు కలిగింది! ఏమిటా అద్భుతమైన జీవితపు హెచ్చరిక! అందులో తనకి ప్రైజ్ వచ్చింది! అది తలుచుకో గానే రామ్మూర్తికి నవ్వొచ్చింది. ఆడియెన్స్‌లో ఒకరి దగ్గరికి వెళ్ళి "మిమ్మల్ని అరెస్ట్ చేస్తున్నాను" అన్నాడు. వెంటనే అతనికి ముచ్చెమటలు పోశాయి.

"ఎందుకు?" అన్నాడు హీనస్వరంతో.

"ఫర్ నథింగ్—ఊరికే."

వెంటనే చుట్టుప్రక్కలవాళ్ళు నవ్వారు.

"సారీ సర్—ఫాన్సీ డ్రెస్."

ఆ వ్యక్తి ఈ జోక్‌కి ముఖం చిట్లించుకున్నాడు. యూనివర్సరీ కాగానే గర్వంగా ప్రైజ్ చేత్తో పట్టుకుని బయటికి వచ్చి ఆ చీకట్లో నడిచిపోతూంటే, సందు మలుపు తిరగ్గానే "పోలీస్‌గారూ, రక్షించండి" అనే కేక విని అదిరిపడ్డాడు. గుడ్డి వెలుగులో పరకాయించి చూశాడు. ఓ అమ్మాయి గబగబ అతని దగ్గరికి వచ్చింది. "ఎవడో దుర్మార్గుడు వెంటబడ్డాడండీ" భయం భయంగా చూస్తూ రొజుతూ అందా అమ్మాయి.

తనకేదో థ్రిల్ కలిగింది.

"ఎవడ్రా" కేకేశాడు దర్పంగా లాఠీ నేలకేసి కొట్టి. ఆ వ్యక్తి నిర్లక్ష్యంగా సిగరెట్ పొగ ఊదుతూ దగ్గిరగా వచ్చి తనవైపు తీక్షణంగా చూస్తూ "నువ్వా!" అని తికమకపడి చప్పున సాగిపోయాడు. ఆశ్చర్యాల్లోకి ఆశ్చర్యం! తను అంతక్రితం తమాషాగా అరెస్టు చేస్తానన్న వ్యక్తే. తనకి నిజంగా నోట మాట రాలేదు. "చాలా థాంక్సండీ పోలీస్‌గారూ. సమయానికి మీరు దేవుడిలా కనిపించకపోతే ఆ దుర్మార్గుడేం చేసేవాడో!" ఆ అమ్మాయి కృతజ్ఞతతో అంది.

"నేను పోలీస్ కానండీ. బి.ఏ. ఫైనలియర్ చదువుతున్నాను. యూనివర్సరీ ఫాన్సీ డ్రెస్ పోటీలో ఈ వేషం వేశాను, అంతే!"

"అలాగా!" ఆ అమ్మాయి విస్మయంతో తేరిపార చూసింది.

"ఇంత రాత్రివేళ ఒంటరిగా ఎక్కడికి వెడుతున్నారు?"

"మా పిన్నికి—అంటే మా రెండో అమ్మకి అకస్మాత్తుగా విపరీతమైన కడుపు నొప్పి వచ్చిందండీ. డాక్టర్‌కోసం వెడుతున్నాను."

"పెద్దవాళ్లెవరూ లేరా?"

"మా నాన్న క్లబ్బులో ఉన్నారో, ప్లీడర్‌గారింట్లో ఉన్నారో యింకా రాలేదు—"

"మీ నాన్నగారేం చేస్తుంటారు?"

"ప్లీడర్ గుమాస్తా."

"మరి క్లబ్బు...." నోరు జారింది.

"పేకాట" ఆమె విషణ్ణవదనం ఆ చీకట్లోని గుడ్డివెలుగులో కూడా స్పష్టంగా కనిపించింది.

"ఇంకెవరూ లేరా?"

"మా తమ్ముళ్లిద్దరూ - అంటే మా చిన్ని పిల్లలు - ఎక్కడ తిరుగుతారో ఎప్పుడొస్తారో తెలీదు."

ఆమె పరిస్థితి అంతా తనకి అర్థమైంది. జాలి వేసింది. ఆ ఇంట్లో ఆమె డ్యూటీలో ఉన్న పరాయి వ్యక్తి! ఆమె మాటల్లో పొడితనమేకాని మమతానురాగాలేమీ లేవు.

"పదండి, నేనూ వస్తా" షివశ్రీతో అన్నాడు. అప్పటినించీ ఆమె టైపు నేర్చుకోటానికి వెళుతున్నప్పుడో, బజారు పనిమీద వెడుతున్నప్పుడో కొన్నిసార్లు ప్రయత్నపూర్వకంగా,కొన్నిసార్లు యాదృచ్ఛికంగా కలుసుకోటం, పరిచయం క్రమంగా వృద్ధిపొంది ఆత్మీయతగా మారటం, ఇద్దరూ పెళ్ళిచేసుకోవాలనే నిర్ణయానికి రావటం జరిగాయి. కాని ఇప్పటిదాకా అది సంభవం కాలేదు. తనకి వెనక అండ ఏమీలేదు. తన ఉద్యోగంమీదే తలిదండ్రులూ, తమ్ముళ్ళూ, చెల్లెళ్ళూ ఆశపెట్టుకుని ఉన్నారు. ఇప్పటివరకూ వాళ్ళకి బరువుగానే ఉన్నాడు. ఇంక వసంతని పెళ్ళి చేసుకొంటే సంసారం ఎలా గడుస్తుంది! కాని....కాని....ఈ రోజు తను ఉద్యోగంలో చేరాడు— అది ఎంత చిన్నదైనా ఉద్యోగం ఉద్యోగమే. వసంతకి చెప్పాలి....ఆ రోజు నకిలీ కానిస్టేబిల్ — ఈ రోజు నకిలీ అసలుగా మారి తను నిజమైన కానిస్టేబిల్‌గా—

రామ్మూర్తి ఆలోచనలకి అంతరాయం కలిగింది.

ఏమిటి రణగొణ ధ్వని ?

భేరీ మృదంగ పటహ కాహళ హళా హళా ? బాండ్, నౌబత్, క్లారినెట్ సన్నాయిల రవళా — అన్నిటి సమ్మిశ్రమమా !

ఓహ్ ! పెళ్లి ఊరేగింపు. పెళ్ళి చేసుకుంటే ఇంత సందడెందుకో ! బొట్లు పేలుతున్నాయి. అవ్వాయిచువ్వ లెగురుతున్నాయి. చిచ్చుబుడ్లు విచ్చుకుని పూలజల్లులు కురిపిస్తున్నాయి.

కారులో వధూవరులు. రామ్మూర్తికి ముచ్చట వేసింది. జీవితంలో ప్రధాన ఘట్టం పెళ్ళి. పెళ్ళిళ్ళు స్వర్గంలో జరుగుతాయట ! రామ్మూర్తికి ఎందుకో సంతోషం కలిగింది. కాని వెంటనే అతని కో ఊహ కలిగి సుఖంలో విచారం వ్యాపించింది. కొన్ని పెళ్ళిళ్లు నరకంలోనే జరుగుతాయి! ఎందుకు ? అతనికి వసంత గుర్తుకొచ్చింది. ఆ వధూవరుల స్థానాల్లో తననీ వసంతనీ ఊహించుకొన్నాడు. అది నిజమవుతుందా ?

కూడలిదగ్గర ఊరేగింపు కొంచెం సేపాగింది.

"ఎవరిదండీ పెళ్ళి ? రామ్మూర్తి తనకి దగ్గరగా ఊరేగింపులో ఉన్న ఒక వ్యక్తిని అడిగాడు.

"కోటేశ్వరయ్యగారమ్మాయిదండీ."

"కోటేశ్వరయ్య ! అవును. అడుగో, బ్లాక్‌మార్కెట్, స్మగ్లింగ్ రంగాలలో ఆ చుట్టుపక్కల దుర్నిరీక్ష్య భాస్కరు డనదగు కోటేశ్వరయ్య. ఇంత ఐశ్వర్యానికీ మూలకారణం అతనికి కొన్ని సంవత్సరాల కిందట ట్రెయిన్ ఏక్సిడెంట్ కావటమేనని అందరికి తెలిసిందే. ఆ ఏక్సిడెంట్‌లో చావు తప్పి కన్ను లొట్టపోయి, ఎన్నడూ తీర్చ నవసరం లేని పరాయి సొమ్ము "అప్పు, అప్పు, అప్పు" అని మూడుసార్లనుకొని చేజిక్కించుకొని బయటపడి కోటేశ్వరయ్య సొంత తెలివితేటలతో కోటికి పడగెత్తి ప్రముఖ వ్యాపారస్తుడయ్యాడు. ఇది అందరూ కథగా చెప్పుకొంటారు. అలాంటి దీర్ఘకాల ఋణం తనకీ దొరికితే ! రామ్మూర్తికి నవ్వొచ్చింది ! అది తీర్చటానికి మళ్ళీ జన్మ ఎత్తాలిట ! థాంక్ గాడ్. ఈ జన్మ చాలు !

"పెళ్లికొడుకు ఎవరు ?"

"ఎవరని చెప్పమంటారు కానిస్టేబుల్‌గారూ.ఎవరో అనామకుడు.కోటేశ్వరయ్య గారమ్మాయి వైపు కన్నెత్తి చూడటానికి కూడా అర్హత లేనివాడు. అడుక్కు తినాలిసినవాడు. ఏదో డిగ్రీ ఉందనుకోండి."

"మరి అలాంటివాడికి ఎలా ఇస్తున్నారు ?"

"ఖర్మ ఈ అమ్మాయి కారులో వెడుతుంటే ఆ అబ్బాయి సైకిల్ మీదొస్తున్నాట్ట. కొత్తగా డ్రైవింగ్ నేర్చుకుంటోంది. ఇంకేం ఏక్సిడెంటయింది. ఏవో కొద్ది గాయాలు

తగిలాయి. ఈమె అతగాడిని హాస్పిటల్‌లో చేర్పించింది. అలా పరిచయం ఏర్పడటం తెలివిగా అతగా డీ పిచ్చిదాన్ని వల్లో వేసుకోటం జరిగింది."

"పోన్లెండి. కోటేశ్వరయ్యగారు విశాలహృదయంతో వ్యవహరించారు. లేక పోతే ఇలాంటివి ట్రాజెడీలు కావొచ్చు."

"విశాలహృదయమా వల్లకాడా! ఎవరి కిష్టముంటుందండీ ఇలాంటి సంబంధం? అసలు పెళ్లి గుట్టుగా గుట్టమీదే జరిగిపోయింది. ఇది పబ్లిక్ పెళ్లి. ఏకైక సంతానం మీద మమత పొదులుకోలేక చేసేది. గత్యంతరంలేక నలుగురిలో తలెత్తుకోటానికి చేసేది," చివరి మాటలంటూ ఊరేగింపుతో ఆ వ్యక్తి సాగిపోయాడు.

రామ్మూర్తి నవ్వుకున్నాడు. గత్యంతరం లేకపోతేనే కోటేశ్వరయ్య నలుగురిలో తలెత్తుకునే పనిచేస్తాడు! ఇందులో ఏవో లాజిక్ అతనికి తోచింది. గత్యంతరం లేని మంచిపనులు జరగాలంటే కొన్ని ప్రమాదాలు జరిగిపోవాలి. ప్రమాదాలు రెండు రకాలు. ప్రమాదకరమైనవీ, ప్రమోదకరమైనవీ. లోకంలో ప్రమోదకర ప్రమాదాలు ఇతోధికమగుగాక! రామ్మూర్తిలోని ఆశావాది ఆశపడ్డాడు. ఆ కారు ప్రమాదం లేక పోతే ప్రేమ లేదు, పెళ్ళి లేదు. ఆ కారులో ఇంకెవరున్నా ప్రేమ లేదు, పెళ్ళిలేదు. అందుకే ప్రేమ ప్రమాదజనితం! లొ ఈజ్ ఏక్సిడెంటల్. అసలు జీవితమే ప్రమాదజనితం! కాకతాళీయ ఘటితం. తను పోలీస్ కానిస్టేబిల్ ఫాన్సీ డ్రెస్ వేయడమేమిటి! ఆ దుస్తుల్లో వసంతకి తారసపడటమేమిటి! ఈ రోజు నిజమైన కానిస్టేబిల్‌గా ఇలా ఇక్కడ నిలబడటమేమిటి! రామ్మూర్తి పెదవులమీద అపహాస పూర్వకమైన విషాదహాసం మొలకెత్తింది. కానిస్టేబిల్‌గిరీ వెలిగించాలిసిన తను డి.ఎస్.పి. ఉద్యోగానికి దరఖాస్తు పెట్టాడు. దరఖాస్తు పెట్టడమేమిటి, పరీక్షలో నెగ్గాడు. ఇంటర్వ్యూకి హాజరై బ్రహ్మాండంగా సమాధానాలు చెప్పానని మురిసి పోయాడు. సంవత్సరం దాటినా ఫలితాలు రావు. కనుక్కుంటే ఏవో రిట్ పిటిషన్లు పడ్డాయనీ, సెలెక్షన్లు డ్రాప్ అయినట్టేననీ అన్నారు. నవనాడులూ కుంగిపోయినాయి. ఏ ఉద్యోగానికి దరఖాస్తు పెట్టినా బాక్ నెంబర్ అయిపోయాడు. రెండు సంవత్సరాలు ఖాళీ. జీవితకాలంలో రెండు సంవత్సరాలు క్రియారహితంగా, సారహీనంగా, నిరాశా భరితంగా గడిచిపోయాయి. వసంత ఒక్కటే వెలుగు కిరణం. కాని....తనమీద వసంతకి క్రమంగా విశ్వాసం సన్నగిల్లిపోతోంది — తను ఒట్టి అసమర్థుడుగా, శక్తి హీనుడుగా, పనికిరానివాడుగా ఆమె భావిస్తోంది. అవును - ఆమె పరిస్థితులు

అలాంటివి. రామ్మూర్తికి అకస్మాత్తుగా ఒక విషయం తోచింది. వసంత తనని ఎప్పుడూ అప్రయోజకుడివని అనలేదు.నిరుత్సాహపరిచే ఏ మాటా అనలేదు.తనే ఊహిస్తున్నాడు. కాని ఉద్యోగ ప్రయత్నం విఫలమైందని చెప్పిన ప్రతిసారీ ఆమె ముఖంలో భరించలేని నిస్పృహ తనకి గోచరించేది. అది తను భరించలేకపోయేవాడు. క్రమంగా తన ఆత్మవిశ్వాసం క్షీణించిపోయింది. ఒకరోజు పేపర్లో చదివాడు. ఎవరో అమ్మాయి స్టవ్ వెలిగిస్తూ, ప్రమాదవశాత్తు చీర అంటుకొని సజీవదహన మయిపోయిందట. వసంతతో యధాలాపంగా ఆ విషయం చెబితే ఆమె ఏదో ఆలోచిస్తూ, చీర అంటుకొంటే, ఎంత సేపు స్పృహ ఉంటుంది, మరణించటానికి ఎంతకాలం పట్టుందని ఏవేవో ప్రశ్నలు గుచ్చి గుచ్చి అడిగింది. తనకి భయం వేసింది.

"ఏమిటి వసంతా ఈ ప్రశ్నలు ? కొంపతీసి నువ్వేమైనా-" అర్థోక్తిలో ఆపి ఆమె ముఖంలోకి తీక్షణంగా చూశాడు.

వసంత నవ్వింది.

"అబ్బే ఏంలేదు. అసలు మనుషులు హాయిగా చచ్చిపోయే మార్గం ఏం లేదా?"

"ఎందుకు లేదు. స్లీపింగ్ పిల్స్" అన్నాడు అనాలోచితంగా.

వసంత చప్పున తలెత్తి దీక్షగా తన కళ్ళలోకి చూసింది. ఎందుకో ఆమె కళ్లలో నీళ్లు తిరిగాయి.

"ఏమిటి వసంతా, ఎందుకు కన్నీళ్ళు ?"

"అబ్బే ఏం లేదు. పాపం ఆ అమ్మాయి...."

ఎవరో అమ్మాయి ప్రమాదవశాత్తు ఒళ్లు కాలి చనిపోతే ఈమె కెందుకు కన్నీళ్ళు ? ఆనాటినించీ తననేదో భయం, నిరాశా, వేదన, నిస్పృహ తరిమి తరిమి కొట్టాయి. స్లీపింగ్ పిల్స్ ! అవును, ఏ నోటితో అన్నాడో, అవే శరణ్యం. ఆ రోజే తన జీవితం ఆఖరు కావలసిన రోజు. నిద్రమాత్రల సీసా తెచ్చుకొన్నాడు. వేదనా భరితమైన జీవితం హాయిగా అంతమైపోవాలి. వసంతని తను ఎలాగూ గట్టెక్కించలేడు. ఆమెకి ఇదే శరణ్యమేమో! కన్నీటితో ఆమెకి మనసులో వీడ్కోలు ఇచ్చాడు. సీసా పాక్ చేసిన చిత్తుకాగితం విప్పాడు. గ్లాసులో నీళ్ళు తెచ్చుకొని బల్లమీదపెట్టాడు. తన కే కోరికలూ లేవు. ఏ భయమూ లేదు. జీవిత నాటకంలో తన పోర్షన్ అయిపోయింది. శక్తికొద్దీ అభినయించాడు. నిష్క్రమిస్తున్నాడు. తన కింకేం కావాలి !

సీసా విప్పి బల్లమీద పడేసిన చిత్తుకాగితం మీద దృష్టి పడింది.

"కావలెను."

తనకి నవ్వొచ్చింది. ఎవరికో ఏదో కావాలి. తనకి కాదు. కాగితం చేతిలోకి తీసుకొని చూశాడు. పోలీస్ కానిస్టేబిల్స్ పదవులకోసం దరఖాస్తులు కావాలిట. తటాలున తన మనసులో తన ఫాన్సీడ్రెస్ గుర్తుకొచ్చింది! పోనీ దరఖాస్తు చేస్తే! మొదట ఆసక్తి కలిగించని ఆ ప్రకటన క్రమంగా తనలో ఆసక్తి రేకెత్తించింది. ఏ ఉద్యోగమైతే ఏం? ఇలాంటి చిన్న ఉద్యోగాలమీద తన దృష్టి పడలేదు. ఎంత సేపటికీ పై చూపే. భూమిమీద ఉంటూ, అది మరిచిపోయి ఆకాశంలోకి చూస్తే ఏం ప్రయోజనం! చచ్చిపోయి ఏం సాధిస్తాడు? తనని నమ్ముకున్న వసంతని అలా అన్యాయం చేసిపోవాలని తనకి అసలు ఎందుకు దుర్బుద్ధి పుట్టింది? సీసా దూరంగా విసిరేశాడు. తను బి.ఏ. పాసైన సంగతి మరచిపోయాడు. కేవలం ఎస్. ఎస్. సి. మాత్రమే తనకుంది. చిత్రం! ఆ క్వాలిఫికేషన్‌తో దరఖాస్తు చేసి ప్రయత్నించగానే ఫలితం దక్కింది. అవును, దేశానికి ఫిలాసఫీ గ్రాడ్యుయేట్లెందుకు! జీవితం ఆఖరవుతుందనుకొన్న రోజు కొత్త జీవితానికి నాంది జరిగింది. యాంత్రికంగా ట్రాఫిక్ సిగ్నల్స్ ఇస్తున్న రామ్మూర్తి తృళ్ళిపడ్డాడు. ఒక కుర్రాడు పరిగెత్తుకు వస్తున్నాడు. అతన్ని కొందరు తరుముతూ అరుస్తున్నారు.

"పట్టుకోండి, పట్టుకోండి."

కూడలి దగ్గరికి ఆ కుర్రాడు పరిగెత్తుకు వచ్చేసరికి ఓ వ్యక్తి అతన్ని పట్టుకుని రెండు చెంపలూ చెళ్ళుమనిపించి తలమీదా, వీపుమీదా దెబ్బలు వేశాడు. ఇంతలో మరికొంతమంది వచ్చి గుంపుగా చేరి ఆ కుర్రాడిని ఇష్టంవచ్చినట్టు బాదసాగారు. ఆ కుర్రాడు దీనంగా చూస్తూ చేతులు దెబ్బలికి అడ్డుపెట్టుకోటానికి ప్రయత్నం చేయటం తప్ప నోరెత్తలేదు. రామ్మూర్తికి జాలివేసింది.

"ఏమిటిది? ఏం చేశాడు ఆ అబ్బాయి?" అంటూ రామ్మూర్తి గుంపులోకి జొరబడి అక్కడ చేరిన మనుషుల్ని పక్కకు నెట్టసాగాడు.

"పర్స్ కొట్టెయ్యటానికి జేబులో చెయ్యి పెట్టాడు రాస్కెల్. సమయానికి చూశాను కనుక సరిపోయింది" ఆ కుర్రాడిని ఇష్టంవచ్చినట్లు కొట్టిన వ్యక్తి అన్నాడు.

పోలీసుని చూసేసరికి ఆ పిల్లవాడు మరింత భయపడిపోయి గుడ్ల నీరు కుక్కుకుని తుడుచుకోసాగాడు.

రామ్మూర్తికి హృదయం ద్రవించింది.

"ఇలాంటివాళ్ళని వొదిలేస్తే ఎవరి జేబులకీ భద్రతలేదు. పోలీసుకు అప్ప చెప్పండి" ఎవరో అన్నారు.

"కానిస్టేబిల్, ఇది నీ ముందే జరిగింది కదా. వీడిని నీకు ఒప్పచెబుతున్నాం" అన్నాడు మొదటి వ్యక్తి రామ్మూర్తి వైపు చూస్తూ.

రామ్మూర్తి అతనివైపు చూశాడు. అతనూ రెప్పవేయకుండా రామ్మూర్తి కళ్ళ లోకి చూశాడు.

"నువ్వా!"

ఆ గొంతు వినేసరికి రామ్మూర్తికి చప్పున గుర్తుకి వచ్చింది. అతనే! నిస్సందేహంగా.

"నువ్వు....నువ్వు...." అతను రామ్మూర్తిని చూస్తూ ఏదో జ్ఞాపకం తెచ్చుకో సాగాడు. అతని పెదవులమీద వ్యంగ్యాత్మకమైన చిరునవ్వు వికృతంగా చిందు లాడింది.

"నేనే," అన్నాడు రామ్మూర్తి ముఖం చిట్లించుకుని అతనివైపు చూస్తూ.

"చివరికి కానిస్టేబిల్ అయ్యావా!"

"అవును. ఇప్పుడు మిమ్మల్ని నిజంగా అరెస్ట్ చేయబోతున్నాను. మీ పేరు!"

"ఎందుకు, నేనేం చేశాను! ఇదీ ఫాన్సీ డ్రెస్సేనా! అన్నాడా వ్యక్తి వ్యంగ్యంగా.

"ఒక కుర్రాడిని నిర్దాక్షిణ్యంగా అతని ముక్కు వెంట రక్తం కారేట్టు కొట్టి నేరం చేశారు."

"అతను నా పర్స్ కాజేయటానికి జేబులో చెయ్యి పెట్టాడు."

"అది వేరే సంగతి - మీరందరూ వెళ్ళండి. లేకపోతే మీ మీద కూడా నేరం మోపాలిసి వస్తుంది." గుంపుని ఉద్దేశించి రామ్మూర్తి అన్నాడు. ఈ బెడద తమ కెందుకని గుంపు చెదిరిపోయింది.

"సరేగాని కానిస్టేబిల్, ఆ రోజు అదే, సుమారు రెండేళ్ళ క్రిందట కనిపించిన ఆ అమ్మాయి పాపం చిక్కుల్లో వున్న బీద పిల్లలాగా కనిపించింది. ఉద్యోగమిప్పించి ఆదుకొందామని చాలా ప్రయత్నించాను. కాని ఆ అమ్మాయి మళ్ళీ ఎక్కడా కనిపించ లేదు. నీకు తెలిస్తే చెప్పు. హాస్యంకాదు. నిజం" అన్నాడా వ్యక్తి.

రామ్మూర్తి దీక్షగా అతని వైపు చూశాడు. ఆ ముఖంలో ఏదో కృత్రిమత్వం, కర్కశత్వం గూడుకట్టుకొని ఉన్నాయి.

"తెలుసు. ఆమె చాలా బీదపిల్ల. మెట్రిక్ పాసయింది. పెళ్ళికాలేదు. ఏం ఉద్యోగం ఇప్పిస్తారు?"

ఆ వ్యక్తి వెంటనే ఆసక్తితో రామ్మూర్తి వైపు చూసి "కాల్‌గరల్ ఉద్యోగం చేస్తుందా!" అన్నాడు.

రామ్మూర్తి "ఆహాఁ" అనుకున్నాడు.

"ఇప్పిస్తారా?"

"మన చేతుల్లో పని—ఆలస్యమెందుకు. నీ డ్యూటీ కాగానే ఆమెని తీసుకురా, మాట్లాడదాం."

"అడ్రస్."

ఆ వ్యక్తి అడ్రసు ఉన్న కార్డు ఇచ్చాడు. రామ్మూర్తి దాన్ని తీసుకుని భద్రంగా జేబులో పెట్టుకున్నాడు.

"త్వరలో సమన్లు అందుతాయి, ఇంక వెళ్ళొచ్చు" నిశితంగా అన్నాడు రామ్మూర్తి. అతను తెల్లబోయి రామ్మూర్తి వైపు తేరిపార చూశాడు.

"వాట్—వాట్—"

"త్వరలో సమన్లు అందుతాయి, పదండి" అన్నాడు రామ్మూర్తి మరింత రెట్టిస్తూ! అతను పళ్ళుకొరుకుకుంటూ, కోపోద్రేకంతో కంపిస్తూ ఏదో అనబోయి తమాయించుకొని చప్పున వెళ్ళిపోయాడు.

ఇదంతా గమనిస్తున్న ఆ కుర్రాడికి లోలోపల బలే సంతోష మయింది. బిక్కు బిక్కు మంటూ ఎక్కుతూనే చిన్నగా నవ్వాడు. రామ్మూర్తి అతని వైపు కోపంగా చూశాడు.

"బడికి పోయి చదువుకోవాలిసినవాడివి దొంగతనానికి బయల్దేరావన్నమాట! జేబులు చూపించు."

ఆ కుర్రాడు దీనంగా చూశాడు. ఖాళీ జేబులు చూపిస్తూ అన్నాడు. "లేదండి. మా అమ్మకీ నాన్నకీ నాలుగు రోజుల్నించి ఫ్లూజ్వరమండి. ఈ పూట కొంచెం తగ్గితే రొట్టె కొందామని బజారుకు వచ్చానండి. డబ్బుల్లేవండి."

"డబ్బుల్లేకుండా ఎలా కొందామనుకున్నావు ! ఎవరినన్నా అడగమన్నాడా మీ నాన్న!"

"లేదండి, మా అమ్మకి నాన్నకీ అసలు నేను రొట్టె కొంటానికి బజారుకొచ్చానని తెలీదండి. ఎవరినన్నా డబ్బులడిగి కొందామనుకున్నానండి."

రామ్మూర్తికి కడుపులో దేవినట్లయింది.

"అడిగావా?"

"అడిగానండి. ఎవరినడిగినా లేదని కసురుకున్నారండి. ఈయనగారి నడిగితే 'పోరా రాస్కెల్' అని చెంపమీద కొట్టాడండి. అంతేకాకుండా పక్కనున్న ఇంకోరితో 'ఇలాంటి వాళ్ళే జేబులు కొట్టేరకం' అన్నాడండి. నాకు బలే కచ్చ వేసింది. లాల్చీజేబులో పర్సు కనిపించిందండి. అది కాజేసి ఆయన తిక్క కుదర్చాలని జేబులో చెయ్యి వేశానండి. పొరపాటయిపోయిందండి. ఇంకెప్పుడూ చేయనండి. నన్నొదిలి పెట్టండి పోలీసుగారూ." ఆ కుర్రాడు ప్రాధేయపడసాగాడు.

"ఇంకెప్పుడూ ఇలాంటి పనులు చేయనని ప్రమాణం చెయ్యి."

ఆ కుర్రాడు నెత్తిన చెయ్యి పెట్టుకున్నాడు.

"నే నప్పుడప్పుడు వచ్చి చూస్తాను. మీ ఇల్లెక్కడ?" చెప్పాడు కుర్రాడు.

"ఇంద, ఇది తీసుకొని రొట్టె కొనుక్కునిపో" రామ్మూర్తి జేబులోంచి ఓ రూపాయి తీసి ఇచ్చాడు. ఆ కుర్రాడు తెల్లబోయి రామూర్తి వైపు చూశాడు.

"వద్దండి."

"పరవాలేదు తీసుకో."

ఆ కుర్రాడు క్షణం తటపటాయించి, రూపాయి తీసుకుని రామ్మూర్తికి దణ్ణం పెట్టి వెళ్ళిపోయాడు. ఆ డబ్బు తీసుకుంటున్నప్పుడు కుర్రాడి ముఖంలోని వెలుగు చూసి రామ్మూర్తి క్షణం తన్నుతాను మర్చిపోయాడు.

డ్యూటీ ముగియటానికి ఇంకా టైమెంతుందో! రామ్మూర్తి ముంజేయి వైపు చూశాడు. అతని గుండె గతుక్కుమంది. చేతికి వాచీ లేదు. ఆ కుర్రాడు జేబులు చూపించాడు ఇందాక. ఆ గుంపులో ఎవరి పనో అయి ఉంటుంది. అసలు దొంగని వదిలి ఆ కుర్రాడిని చావచితక్కొట్టారు పాపం. రామ్మూర్తి మనసు వికలమైంది. అతనికి వాచీ పోయినందుకు విసుగ్గా వుంది. కోపంతో నొసలు చిట్లించాడు. తనేం

కానిస్టేబిల్! లేసుక్కలా ఎవడో పల్లిగ్గా తన వాచ్ కొట్టేస్తుంటేనే కనుక్కోలేక పోయాడు!

"వాతాపి గణపతిం భజేహం...." తన కిష్టమైన సన్నాయి వాద్యం వినిపిస్తుంటే రామ్మూర్తి తలెత్తి దృష్టి సారించాడు. మంగళవాద్యాలతో ఎవరో స్వామి చిన్న ఊరేగింపుతో వస్తున్నాడు. ఒకరు ఆయనకి గొడుగు పట్టారు. ఇంకొకరు వింజామర వీస్తున్నారు. మరొకరు పువ్వులు జల్లుతున్నారు. ఇలా సేవలందుకుంటూ ఆ చిన్న గుంపు మధ్యన ఠీవిగా తలెత్తి ప్రపంచమంతటా ఉద్ధరిస్తున్నట్టు అభయ ముద్రతో బ్రహ్మరథంలా సాగివస్తున్న ఆ సంన్యాసిని చూస్తుంటే రామ్మూర్తికి అమితమైన చిరాకు కలిగింది. ఆ జనం తన ప్రక్కనుంచి వెడుతుంటే కొంచెం ఎద్దేవగా ఒక వ్యక్తిని ఉద్దేశించి అన్నాడు రామ్మూర్తి.

"ఎవరండీ ఈ స్వామివారు?"

"శ్రీశ్రీశ్రీ ఓంకారేశ్వర పరబ్రహ్మస్వరూప సచ్చిదానంద స్వాములవారు" భక్తిప్రపత్తులతో జవాబిచ్చాడు ఆ వ్యక్తి.

"ఏం స్వాములో! ఒక ప్రక్క దారిద్ర్యంతో, ఆకలితో, బాధలతో, దగాలతో, దొంగతనాలతో జనం తల్లడిల్లిపోతుంటే, 'ఉన్నాను కనుక ఆలోచిస్తున్నాను' అని తత్త్వవేత్తలు ఆలోచనల దుమారం లేపి మనిషి తన భవిష్యత్తు తనే నిర్మించుకుంటాడని ఉద్ఘోషిస్తుంటే, ఎందుకండీ ఈ స్వాములు? సోషలిజం కోసం విప్లవ శంఖం పూరించే కార్యశూరులు కావాలండీ దేశానికి. అలాంటి వాళ్ళకి గొడుగుపడితే అందం చందం. పలాయనమంత్రం పఠిస్తూ మూలన కూర్చునే మిథ్యావాదుల కెందుకండీ ఛత్ర చామరాలూ, పూర్ణకుంభాలూ, బ్రహ్మరథాలూ!" ఉద్రేకంతో, ఆవేశంతో తన్నుతాను మర్చిపోయి ఉపన్యాసం దంచేశాడు రామ్మూర్తి.

స్వామి తటాలున వెనక్కి తిరిగి చూశాడు. రామ్మూర్తి ఆయనవైపు తిరస్కారంగా చూశాడు. ఆయన మందస్మితవదనుడై రామ్మూర్తి దగ్గిరగా వచ్చాడు.

"ఏమనుకోకు నాయనా, నీ కిష్టం లేకపోయినా ఈ ఉద్యోగం చేస్తున్నట్టున్నావు. ఎవరిని ఉద్ధరించటానికో తెలుసుకోవచ్చా ?" మృదువుగా అడిగాడు స్వామి.

రామ్మూర్తి చకితుడయాడు. తన కీ ఉద్యోగం ఇష్టం లేదని ఈయన కెలా తెలుసు ?

"ఎవర్నీకాదు. నన్ను ఉద్ధరించుకోటానికే" బింకంగా జవాబిచ్చాడు.

"నీ కిష్టం లేకపోయినా నిన్ను ఉద్ధరించుకోటానికి నువ్వు ఉద్యోగం చేస్తున్నావు. నా కిష్టమై నన్నుద్ధరించుకోటానికి నేను సంన్యాసినయ్యాను. తప్పేమైనా ఉందా ?"

"కాని నేను నా రెక్కల కష్టంమీద బతుకుతున్నాను."

"నీ సేవలు ప్రభుత్వానికి కావాలి. నా సేవలు ఈ కొద్దిమందికి కావాలి."

"మీరు ప్రజల్ని మూఢుల్ని చేస్తున్నారు."

"ఒకరి ఆలోచనే, ఒకరి మార్గమే సార్వజనీనం కావాలా ? మనిషి ఒంటరి వాడనీ, ఎవరి బతుకు వారిదనే కదా అస్తిత్వవాదం చెబుతుంది. ఆనందం కోసమే కదా ప్రతి మనిషీ గవేషించేది. ఎవరి ఆనందం వారిది కాదా. ఆనందం మానసికమే గదా. ఇలా ఎప్పుడూ ఆలోచించలేదా, ఫిలాసఫీలో బి.ఏ. పాసయినట్లున్నావు ?" దీక్షగా రామ్మూర్తి కళ్ళలోకి చూస్తూ నెమ్మదిగా చిరునవ్వుతో అన్నాడు స్వామి.

రామ్మూర్తి అప్రతిభుడయ్యాడు.

"నేను....నేను....బి.ఏ. ఫిలాసఫీ అని మీ కెలా తెలిసింది !" ఆశ్చర్యంతో అప్రయత్నంగా అడిగాడు రామ్మూర్తి.

"అవకతవకగా నిలబడ్డావు. ఇలా నిలబడటం నీ కిష్టంలేదు. టోపీ బాగా ముందుకి లాక్కున్నావు. నిన్నీ వేషంలో ఎవరూ గుర్తుపట్టకూడదని నీ ప్రయత్నం. స్వచ్ఛంగా మాట్లాడుతున్నావు. విద్యాధికుడివి. కనీసం గ్రాడ్యుయేటు అయితే గాని ఈ ఉద్యోగం న్యూనతగా భావించవు. సమాజశాస్త్రాలు మాట్లాడావు. ఆర్ట్సు గ్రాడ్యుయేట్ వి అయి ఉండాలి. అస్తిత్వవాదం ఉదహరించావు. ఫిలాసఫీ చదివి ఉండాలి. ఇంత చిన్న వయస్సులో అభిరుచికొద్దీ చదివి ఉండవు. పాఠ్యాంశమై ఉండాలి. ఏం, షెర్లాక్ హోమ్స్‌లా మాట్లాడుతున్నానా ? నీ ఉదాత్త భావాలకి ఎంతో సంతోషంగా ఉంది. ఈ ఉద్యోగపరిధి నీకు చాలదు. త్వరలో డి.ఎస్.పి. వై సమాజానికి చేతనైన సేవచేస్తావని ఆశిస్తాను. నీకు శుభమవుతుంది నాయనా !"

ఆశీర్వాదసూచకంగా చేయెత్తి స్వామి ముందడుగు వేశాడు. రామ్మూర్తికి కృతజ్ఞతగా ఏమైనా అనాలనికూడా తోచలేదు. అతని మనసు మనసులో లేదు. నిజంగా ఆయన తార్కికంగా ఊహించే తను బి.ఏ. ఫిలాసఫీ అన్నాడా! లేకపోతే ఆ గుంపులో తను ఎరిగినవారెవరైనా ఉండి ఆయన చెవిలో ఊదారా ? లేక సిక్స్త్‌సెన్స్ ఏమైనా

ఉందా? ఏమీ తేల్చుకోలేక రామ్మూర్తి తన ఉనికిని మరచి ఆయన వెళ్ళిన వైపు అలాగే చూస్తూ నిలబడిపోయాడు. ఓహో! ఏమి రాజస సాత్త్విక మూర్తి.

అదేపనిగా కారు హారన్ గీ పెంటోంది.

మోటారు సైకిలు గుర్రుగుర్రుమంటోంది.

రిక్షా గంట గొణుగుతోంది.

సైకిల్ గంట టంగ్ టంగ్ మంటోంది.

రామ్మూర్తి కివేమీ పట్టలేదు. తనవి ఉదాత్తభావాలట! పై అంతస్తు గ్రాడ్యుయేట్‌నవే అహంతో అలా అక్కడ నిలబడటం న్యూనతగా అంతరాంతరాల్లో భావించే తనకి ఉదాత్తభావాలున్నాయా? స్వామి అన్యాపదేశంగా సూచించలేదుగద! రామ్మూర్తి చప్పున టోపీ సరిచేసుకున్నాడు. ఠీవిగా నిలబడ్డాడు. వెంటనే కారు హారన్, మోటారు సైకిల్ గుర్రు, రిక్షాగంట గొణుగుడు, సైకిల్ గంట మోత కలిసి హోరుమన్న ధ్వని వినిపించింది. రామ్మూర్తి గాభరాపడ్డాడు. ఎవరికి ఏ డైరెక్షన్ ఇవ్వాలో తెలియక తికమకగా అనుభవశూన్యంగా చేతులు తిప్పాడు.

మోటారుసైకిల్, రిక్షా ఢీకొన్నాయి. రిక్షా తలకిందులైంది. మోటారు సైకిల్ పక్కకు పడిపోయింది.

'అమ్మో' అనే కేకలు వినిపించాయి.

రామ్మూర్తికి భూమి గిర్రున తిరిగినట్టనిపించింది. చప్పున రిక్షా దగ్గరికి వెళ్లాడు. రిక్షావాడు తప్పించుకున్నాడు.కాని రిక్షాలోవున్న యిద్దరు స్త్రీలు రోడ్డుమీద పడిపోయారు. ఇద్దరిలో ఒకామె నడివయసు స్త్రీ.రెండో ఆమెకి నలుగురిలో అలా కిందపడిపోవటంతో తల కొట్టేసినట్టయి ఎర్రబారిన ముఖంతో కిందిచూపులు చూస్తూ లేవటానికి ప్రయత్నిస్తోంది. రామ్మూర్తి ఆమెకి ఆసరా ఇచ్చి చెయ్యిపట్టుకుని నుంచోబెట్టి ఆమె ముఖం వైపు చూసి అదిరిపడ్డాడు.

"వసంతా, నువ్వా ?"

ఆమె పరిచిత స్వరం విని తలెత్తి రామ్మూర్తివైపు చూడసాగింది. సంతోషం ఆశ్చర్యం ఆమె ముఖంలో తాండవించాయి.

"మీరా !"

"అవును వసంతా, ఉద్యోగంలో చేరాను. నీకు చెబుదామనుకుంటుంటే, ఇలా అకస్మాత్తుగా నాటకంలోలా నువ్వే కనిపించావు. దెబ్బలు తగిలాయా ?

"తగిలితే తగిలాయి. అబ్బ నాకు బలే సంతోషంగా వుంది."

"ఎందుకు ?"

' మీకు ఉద్యోగం దొరికిందిగా."

రామ్మూర్తి ఆమె కళ్ళలోకి చూశాడు. ఆమె కళ్లు మెరుస్తున్నాయి. అతను హాయిగా నవ్వాడు.

"ఈమె ఎవరు ?"

"ఎవరో హైద్రాబాద్‌లో సాంఘిక సేవికట. అర్హత ఉన్న ఆడవాళ్లకి ఉద్యోగా లిప్పించి స్త్రీ జనాభ్యుదయం కోసం పాటుపడుతున్నది. నేను మెట్రిక్, టైపు పాసయానుగా. హైద్రాబాదులో ఉద్యోగం ఇప్పిస్తానంది. ఇప్పుడు బస్సులో హైద్రాబాద్‌కే ప్రయాణం."

రామ్మూర్తి ముఖం చిట్లించాడు.

"ఎంత పిచ్చిదానివి వసంతా ? ఇంకా నయం దైవికంగా ఇలా కలుసుకున్నాం. లేకపోతే ఏమైపోయేదానివో !"

వసంతకి అతని మాటలు అర్థం కాలేదు.

"ఏమిటి మీరనేది ? ఆమె దగ్గర పెద్ద పెద్ద ఆఫీసర్లు, రాజకీయ నాయకులు ఇచ్చిన సర్టిఫికెట్లు బోలెడున్నాయి. నే నంత తెలివి తక్కువదాన్నా, కళ్ళుమూసుకొని ఆమె వెంట పోటానికి !"

అసహనంతో కారులో కూర్చుని ఇందాకటినుంచీ కారుహారన్ మోగిస్తున్న వ్యక్తి ఏక్సిడెంట్ కాగానే చప్పున కారుదిగి తలుపు దఢాలునవేసి మోటారుసైకిల్ మీద నుంచి పడిన వ్యక్తిని లేపాడు. రామ్మూర్తి వసంతతో మాట్లాడుతూ అక్కడే నిలబడి ఉండటం గమనించాడు.

"కానిస్టేబిల్ !"

ఆ గర్జన విని ఉలిక్కిపడి చూసాడు. ఒక్కక్షణం ఆ వ్యక్తిని పరాకాయించి చూశాడు. అతనికి ముచ్చెమటలు పోశాయి. డి.ఎస్.పి. ! తటాలున సరిగా నిలబడి సెల్యూట్ చేశాడు.

"ఏమిటీ అవకతవక వ్యవహారం ? యూస్‌లెస్, కేర్‌లెస్, ఇన్‌ఎఫిషియంట్ ఫెలో, అలా చూస్తూ నిలబడతావేం ? ఐ విల్ డిస్‌మిస్ యూ. వాళ్ళని హాస్పిటల్‌కి చేర్చు ముందు."

"ఎస్, సార్." యాంత్రికంగా అన్నాడు రామ్మూర్తి.

"సార్, ఏక్సిడెంట్ జరిగినప్పుడు వీరు డ్యూటీలో లేరు" అంది వసంత ధైర్యంగా.

"డ్యూటీలో లేడా ? ఏమిటి నీ అభిప్రాయం ?"

"అదికాదు సార్—"

"వసంతా !" రామ్మూర్తి అయోమయంగా ఆమెవైపు చూస్తూ ఆమె మాటలకి అడ్డు వచ్చాడు.

"అవును సార్. డ్యూటీ ఎనిమిదింటి కయిపోయింది. ఏక్సిడెంటు ఎనిమిదీ పదినిముషాలకి జరిగింది. రిక్షాలోంచి పడిపోయినప్పుడు నా వాచ్‌కి దెబ్బ తగిలి ఆగిపోయింది. చూడండి."

డి.ఎస్.పి. యాంత్రికంగా రిస్ట్‌వాచ్ చూసుకున్నాడు. ఎనిమిదీ పదిహేను నిముషాలయింది. అతను ముఖం చిట్లించాడు.

"అయితే ఏమంటావు?"

"డ్యూటీలో లేరు కనుక ఏక్సిడెంట్‌కి ఆయన బాధ్యులు కారు. ఆయన్ని డిస్‌మిస్ చేయటానికి వీలులేదు."

రామ్మూర్తి ముఖం వికసించింది.

"ఇంత తెలివిగలదానివి ఆ మోసగత్తె వలలో ఎలా పడ్డావు వసంతా ?" అనుకున్నాడు.

డి.ఎస్.పి. నవ్వాడు.

"ఐసీ. హూ ఆర్ యూ బైది వే ?"

వసంత సిగ్గుతో కింది చూపులు చూసింది. రామ్మూర్తి విషయం మరలించటానికి అన్నాడు.

"సార్, ఆమె ఉద్యోగాల ఎరచూపి ఆడపిల్లల్ని మోసంచేసే మోసగత్తెలా వుంది. ఈమెని ఈ విషయంలోనే హైద్రాబాద్ తీసుకువెడుతోంది. పొద్దున మీరు ఎస్.ఐ. గారికి ఈమె పోలికలున్న ముఖం గల ఫోటో చూపించి ఆరా తియ్యమని చెబుతున్నప్పుడు నేను ఫోటో చూశాను సార్. మీరు కూడా చూడండి."

డి.ఎస్.పి, ఆతృతతో ఆమె ముఖం చూసి వండర్‌ఫుల్—ఐ విల్ ప్రమోట్ యూ కాన్‌స్టేబిల్" అన్నాడు.

"థాంక్స్ సర్."

"బైదివే - హూ ఈజ్ షి. టెల్‌మి చైల్డ్ – హూ ఆర్ యూ?"

వసంత మృదుమధురంగా అంది.

"అయామ్ ది బ్రైడ్ ఆఫ్ కాన్‌స్టేబిల్ శ్రీ రామ్మూర్తి. బి.ఏ. ఫిలాసఫీ."

డి.ఎస్.పి. దిగ్భ్రమ చెంది రామ్మూర్తి వైపు చూశాడు.

"రామ్మూర్తీ—బి.ఏ."

రామ్మూర్తికి అమిత సంతోషం వేసింది—తను బి.ఏ. అని డి.ఎస్.పి.కి తెలిసినందుకు కాదు. వసంత తియ్యటి మాటలకి.

ఇంత సేపూ ఇదంతా వింటూ అక్కడే నిలబడి దుస్తులకి అంటిన దుమ్ము దులుపుకుంటున్న వ్యక్తి తటాలున రామ్మూర్తి ముందుకొచ్చి నిలబడ్డాడు.

"ఒరే రామ్మూర్తీ ! నువ్వేనట్రా ?"

రామ్మూర్తి ఆ వ్యక్తివైపు చూసి చిరునవ్వు నవ్వాడు. "నేనే ప్రకాష్."

"ఓరీ నీ దుంపతెగ. చిన్నప్పటినించీ క్లాస్‌మేట్‌నైనా ఈ డ్రెస్‌లో నిన్ను గుర్తుపట్ట లేకపోయారా. గొంతు విన్నప్పుడు అనుమానం కలిగిందిరా. ఒరే పొద్దుటి నుంచీ నీ కోసం గాలిస్తున్నారా. పొద్దున డి.ఎస్.పి. సెలెక్షన్లు వచ్చాయిరా. నువ్వు సెలెక్టయావురా ఫూల్, రోగ్, రాస్కెల్, స్కౌండ్రల్, ఇడియట్ ..."

అతని చెయ్యి అందిపుచ్చుకొని అదేపనిగా కరచాలనం చేస్తూ ప్రకాష్ ఏమేమో అంటుంటే పోర్షన్‌మరిచిపోయిన పాత్రధారిలా అవాక్కయి నిలబడిపోయాడురామ్మూర్తి.

[యువ దీపావళి - 1978]